రైతుకు బాసటగా వైఎస్సార్ సీపీ



శృంగవృక్షంలో అన్నదాత పోరు పోస్టర్‌ను విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు



రౌతులపూడిలో అన్నదాత పోరు పోస్టర్‌ను విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



డి.పోలవరంలో అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

- కర్షకుల సమస్యలపై నేడు అన్నదాత పోరు కార్యక్రమం
- పోస్టర్లు విడుదల చేసిన పార్టీ నేతలు
- విజయవంతం చేయాలని రైతులు, పార్టీ శ్రేణులకు పిలుపు

తుని రూరల్: యూరియా రైతులకు దక్కకుండా దొడ్డిదారిలో కూటమి నాయకులు తరలించుకుపోతున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి చింతల వెంకటరమణ ఆరోపించారు. డి.పోలవరం రామాలయం వద్ద సోమవారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా ఆదేశాలతో ఆ పార్టీ మండల అధ్యక్షుడు దుంగల నాగేశ్వరావు అధ్యక్షతన అన్నదాత పోరుబాట పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు వైఎస్సార్ సీపీ బాసటగా నిలుస్తోందన్నారు. కూటమి నాయకులు యూరియా దొడ్డిదారులో బ్లాక్ మార్కెట్‌కు తరలించుకుపోయారన్నారు. రైతుల ఆందోళనతో ఇప్పుడు కూపన్లు జారీ చేస్తుండడం హాస్యస్పదమన్నారు. రైతు సమస్యలపై మంగళవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయం వద్ద నిర్వహించే అన్నదాత పోరుబాట ధర్నాకు రైతులు తరలిరావాలని పార్టీ నేత పోతల రమణ పిలుపునిచ్చారు. నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు అన్నంరెడ్డి వీర్రాఘవులు, ఆత్మ మాజీ చైర్మన్ చోద్రాజు రాంబాబురాజు, తాండవ షుగర్స్ మాజీ అధ్యక్షుడు నాగం దొరబాబు, నాయకులు చిటికెల వరహాలబాబు, అంకంరెడ్డి దొరబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

యూరియా సరఫరాలో కూటమి విఫలం

గండేపల్లి: ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన యూరియాను అందించడంలో కూటమి ప్రభుత్వ విఫలమైందని ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ పేర్కొన్నారు. గండేపల్లిలోని పార్టీ కార్యాలయంలో సోమవారం అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో యూరియా పక్కదోవ పడుతుందని ఆరోపించారు. రైతు సమస్యలపై మంగళవారం నిర్వహించే అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ విభాగం జనరల్ సెక్రటరీ తాళ్లూరి మధుకుమార్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రామకుర్తి మూర్తి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు కందిరెల్లి కామేష్, మేధావుల సంఘం జిల్లా అధ్యక్షుడు అవసరాల పార్థసారథి, మండల కోశాధికారి కర్రి కృష్ణ, ఉప్పలపాడు సొసైటీ మాజీ అధ్యక్షుడు అడబాల రాజు తదితరులు పాల్గొన్నారు.

రౌతులపూడి: రైతు సమస్యలపై మంగళవారం డివిజన్ స్థాయిలో నిర్వహించే అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల నేతలు కోరారు. పార్టీ ప్రత్తిపాడు కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ఆదేశాల మేరకు సోమవారం స్థానిక పార్టీ నాయకుడు కేదారిశెట్టి నాగేశ్వరరావు రైసు మిల్లు వద్ద మండల కన్వీనర్ సీహెచ్‌వీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో అన్నదాత పోరు పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం యూరియా కృత్రిమ కొరతను సృష్టించి బినామీలు పేరుతో కూటమి నాయకులు జేబులు నింపుకుంటున్నారని ఆరోపించారు. 40 ఏళ్ల రాజకీయ చరిత్ర ఉందన్నా చంద్రబాబు రైతులకు సకాలంలో యూరియా అందివ్వకపోవటం సిగ్గుచేటు అని మండిపడ్డారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సూరెడ్డి తిరుములరాయల్ సాయి, రౌతులపూడి ఉపసర్పంచ్ వాసిరెడ్డి భాస్కరబాబు, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి కాకి నాని, రాష్ట్ర బీసీ విభాగం అధికార ప్రతినిధి గొల్లు వెంకటరమణ, సర్పంచులు సర్నం శ్రీను, కొరుప్రోలు దేవుడు, సైపురెడ్డి వెంకటరమణ, పోలుపర్తి తాతాజీ, పారేపల్లి శ్రీరామకృష్ణ, పక్కుర్తి జయబాబు,బండారు భైరాగి తదితరులు పాల్గొన్నారు.



గండేపల్లిలో అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



ప్రత్తిపాడులో అన్నదాత పోరు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ప్రత్తిపాడు: కూటమి ప్రభుత్వం రైతాంగం పట్ల అవలంబిస్తున్న తీరును నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయం వద్ద నిర్వహించే అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలు ఆవరణలో సోమవారం అన్నదాత పోరు వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యూరియాతో పాటు రైతులకు కావలసిన ఎరువులను తక్షణమే సరఫరా చేయాలని, బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించాలని, ఎరువులను పక్కతోవ పట్టిస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని, పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పార్టీ మండల కన్వీనర్ రామిశెట్టి బులి రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు, పార్టీ నాయకులు గుడాల వెంకటరత్నం, శేరు కృష్ణ, ఏడిద రెడ్డినాయుడు, జువ్వల చినబాబు, దాడిశెట్టి నూకాపతి, దళే చిట్టిబాబు, మాజీ సర్పంచ్ మాకా చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

తొండంగి: రైతు సమస్యలపై మంగళవారం నిర్వహించే అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు పిలుపునిచ్చారు. మండలంలోని శృంగవృక్షంలో సోమవారం పార్టీ నాయకులతో కలిసి అన్నదాత పోరు పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. పెద్దాపురం ఆర్డీవో కార్యాలయం వద్ద నిర్వహించే కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తరలిరావాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గ్రామ సచివాలయాల ద్వారా రైతుల చెంతకే ఎరువులు సరఫరా చేశారన్నారు. ప్రస్తుతం రైతులకు ఎరువులు అందించలేని దీనస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. రైతులకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బత్తుల వీరబాబు, పార్టీ పంచాయతీ విభాగం రాష్ట్ర కార్యదర్శి కొయ్యా మురళి, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి మడదా హేమంత్, పార్టీ నాయకులు ఆరుమిల్లి ఏసుబాబు, బూత్‌కమిటీల విభాగం రాష్ట్ర కార్యదర్శి బెక్కం చంద్రగిరి, ఇంటెలెక్చువల్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి ఎలిశెట్టి గిరి, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు అంగుళూరి సుశీలారాణి, యూత్ కన్వీనర్ పప్పుల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత పోరు విజయవంతం చేయండి

జగ్గంపేట: రైతు సమస్యలపై మంగళవారం పెద్దాపురంలో నిర్వహించే అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రావుల గణేష్‌రాజా పిలుపునిచ్చారు. జగ్గంపేటలోని పార్టీ కార్యాలయంలో అన్నదాత పోరు పోస్టర్‌ను పార్టీ నేతలతో కలిసి సోమవారం ఆయన విడుదల చేశారు.మాజీ మంత్రి, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తోట నరసింహం ఆధ్వర్యంలో మంగళవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయం వద్ద చేపట్టే అన్నదాత పోరు కార్యక్రమానికి నియోజకవర్గ నలుమూలల నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నేతలు తులా రాము, రామకుర్తి జగాల్, కాపారపు ప్రసాద్, కరుటూరి వీర్రాజు, భూమాడ గణపతి, నరిరెడ్డి విష్ణు, గుర్రం మహాలక్ష్మి, నక్కా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రైతు వ్యతిరేక పాలన

కోటనందూరు: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రైతు వ్యతిరేక పాలనను సాగిస్తోందని ఎంపీపీ లగుడు శ్రీనివాస్ ఆరోపించారు. రైతులు పండించిన పంటలకు కనీస గిట్టుబాటు ధర కల్పించకపోగా కనీసం రైతుకు యూరియా బస్తా ఇవ్వలేని దయనీయ పాలన సాగిస్తోందని మండిపడ్డారు. స్థానిక కల్యాణ మండపంలో రైతుపోరు పోస్టర్‌ను వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, మంత్రులు రైతులను తక్కువ చేసి మాట్లాడడం బాధాకరమన్నారు. కోటనందూరు మండలంలో 15 వేల ఎకరాల్లో రైతులు సాగు చేస్తుంటే కేవలం ఐదు వేల బస్తాల యూరియాను మాత్రమే సరఫరా చేశారన్నారు. రైతు సేవా కేంద్రాలకు వచ్చిన యూరియాను అధికారులపై ఒత్తిడి తెచ్చి కూటమి నేతలు బ్లాక్‌లో అమ్ముకుంటున్నారని మండిపడ్డారు. రైతుకు అండగా మంగళవారం డివిజన్‌స్థాయిలో చేపట్టే రైతుపోరు కార్యక్రమానికి రైతులతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గొర్లి రామచంద్రరావు, లంక ప్రసాద్, బొంగు ఉమారావు, నల్లమిల్లి గోవిందు, సుర్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



కోటనందూరులో రైతుపోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ శ్రీనివాసు తదితరులు

అన్నదాత పోరును విజయవంతం చేయాలి

ఏలేశ్వరం: ఎరువుల బ్లాక్ మార్కెట్‌కు నిరసనగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించే అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ గొల్లపల్లి సురేష్ కోరారు. పార్టీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ఆదేశాల మేరకు యర్రవరంలో పార్టీ మండల కన్వీనర్ గొల్లపల్లి సురేష్, గొల్లపల్లి కాశీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో అన్నదాత పోరు పోస్టర్‌ను అవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రైతులను పట్టించుకున్న నాథుడే లేడన్నారు. కూటమి నాయకులు ఎరువులను బ్లాక్ చేసి అమ్ముకోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బీశెట్టి అప్పలరాజు, గుల్లంపూడి గంగాధర్, నీరుకొండ అర్జునరావు, బుద్ధా నానాజీ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో...

ఏలేశ్వరం పాతబస్టాండ్ సమీపంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద అన్నదాత పోరు పోస్టర్‌ను వైఎస్సార్ సీపీ నాయకులు అవిష్కరించారు. పార్టీనాయకులు బదిరెడ్డి గోవిందు, సామంతుల సూర్యకుమార్, శిడగం వెంకటేశ్వరరావు, సుంకర రాంబాబు, పైల విజయ్‌కుమార్, కోరాడ ప్రసాద్, దళే కిషోర్, వాగు బలరామ్ తదితరులు పాల్గొన్నారు.



యర్రవరంలో అన్నదాత పోరు పోస్టర్‌ను అవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వైఎస్సార్ సీపీ నేత జమీలుకు సత్కారం

రౌతులపూడి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, పార్టీ తుని, పెద్దాపురం నియోజకవర్గాల సహాయ పరిశీలకుడిగా నియమితులైన వాసిరెడ్డి జగన్నాథం(జమీలు)ను సోమవారం ఆ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. స్థానిక పార్టీ నేత కేదారిశెట్టి నాగేశ్వరరావు రైసు మిల్లు వద్ద జమీలును శాలువా, పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఆవిర్భావం నుంచి పార్టీలోనే ఉంటూ పార్టీ అభివృద్ధి ఎనలేని సేవలందించిన జమీలుకు రాష్ట్ర కార్యదర్శి పదవి ఇచ్చిన పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి, ప్రత్తిపాడు కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సాయి, రౌతులపూడి ఉపసర్పంచ్ వాసిరెడ్డి భాస్కరబాబు, పార్టీ మండల కన్వీనర్ సీహెచ్‌వీవీ సత్యనారాయణ, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి కాకి నాని, బీసీ విభాగం అధికార ప్రతినిధి గొల్లు వెంకటరమణ, పార్టీ నాయకుడు పారేపల్లి శ్రీరామకృష్ణ, సర్పంచులు సర్నం శ్రీను, కొరుప్రోలు దేవుడు, సోమరౌతు తిరుముల వెంకన్నదొర, సైపురెడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



రౌతులపూడిలోలో వాసిరెడ్డి జమీలును సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

జగన్‌ను మళ్లీ సీఎం చేయడమే లక్ష్యం

కిర్లంపూడి: వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నట్టు వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు, నర్సాపురం పార్లమెంట్ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం నివాసంలో ఆయనను, గిరిబాబును ముదునూరి మురళీ కృష్ణంరాజు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ గిరిబాబు రాకతో నియోజవర్గంలో వైఎస్సార్ సీపీకి ప్రజల నుంచి ఆదరణ పెరుగుతోందన్నారు. ముద్రగడ నాయకత్వంలో పార్టీ విజయమే ధ్యేయంగా పని చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కోలా తాతబాబు, జువ్వల దొరబాబు, వాకనాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిబాబును కలిసిన రఘురాం

వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ పరిశీలకుడు ఒమ్మి రాఘురాం సోమవారం కిర్లంపూడిలో పార్టీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబును కలిశారు. గిరిబాబుతో కలిసి పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నట్టు తెలిపారు.



కిర్లంపూడిలో గిరిబాబును కలసిన ఒమ్మి రఘురాం

ముద్రగడను కలిసిన చినబాబు



ముద్రగడతో మాట్లాడుతున్న చినబాబు

కోటనందూరు: వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభంను ఆ పార్టీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. కిర్లంపూడి స్వగృహంలో సోమవారం ముద్రగడను కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. హైదరాబాదులో డాక్టర్లు అందించిన వైద్యం, పార్టీ అధినేత జగన్ చేసిన సహాయ సహకారాలను ఆయన వివరించినట్లు చినబాబు తెలిపారు. కార్యక్రమంలో తుని, పెద్దాపురం నియోజకవర్గాల వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి జమీలు, రౌతులపూడి జెడ్పీటీసీ గొల్లు చినదివాణం పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ అధికారులపై ఫిర్యాదు

శంఖవరం: రోడ్లు, భవనాల శాఖ అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సామాజిక కార్యకర్త మేకల కృష్ణ తెలిపారు. రౌతులపూడి సెక్షన్ ఏఈ, తుని సబ్ డివిజన్ డీఈఈ, కాకినాడ సర్కిల్ ఎస్‌ఈఈలు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్నారని ఫిర్యాదు పేర్కొన్నారు. తమ ప్రాంతంలో రహదారులు ధ్వంసం అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం, బవురువాక గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలను సోమవారం వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు పరామర్శించారు. గ్రామానికి చెందిన కడారి వీరబాబు (గంగోలి)కి ఇటీవల హార్ట్ స్ట్రోక్ రావడంతో కాకినాడలోని మెడికోవర్ హాస్పటల్‌లో వైద్య సేవలు పొందుతున్నారు. ఆయనను మురళీకృష్ణంరాజు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మండలంలోని బవురువాక గ్రామ సర్పంచ్ దొడ్డి సత్యనారాయణ భార్య గౌరి కల్యాణి ఇటీవల మృతి చెందారు. ఆమె కుటుంబ సభ్యులను మురళీకృష్ణంరాజు పరామర్శించారు. కల్యాణి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జువ్వల బాబులు, కోలా తాతబాబు, దాడి పుత్రయ్య, తిమ్మిశెట్టి రాజా పాల్గొన్నారు.

'ఒమ్మి'కి అభినందనల వెల్లువ

జగ్గంపేట: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన జగ్గంపేటకు చెందిన ఒమ్మి రఘురాంకు అభినందనలు వెల్లువెత్తాయి. జగ్గంపేట నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు సోమవారం ఆయన స్వగృహానికి చేరుకుని పూలమాల, శాలువాలతో సత్కరించారు. పార్టీ ఆవిర్భావం నుంచి అంకిత భావంతో పార్టీ పటిష్టతకు కృషి చేసిన ఒమ్మి రఘురాంకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పించారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఒమ్మి రఘురాం మాట్లాడుతూ పార్టీ అధిష్టానం సూచనల మేరకు పార్టీ చేపట్టే అన్నికార్యక్రమాలను విజయవంతం చేస్తానని తెలిపారు. పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జగ్గంపేటలో ఒమ్మి రఘురామ్‌ను సత్కరిస్తున్న పార్టీ నేతలు, అభిమానులు

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సత్కారం

రౌతులపూడి: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను యూటీఎఫ్ మండల శాఖ ప్రతినిధులు సోమవారం ఘనంగా సత్కరించారు. స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన ఎర్రా శ్రీనివాస్, గోడు ప్రసన్న, మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన ఎల్.రమణబాబు, జి.సీతాకుమారి, ఇ.దేవరాజు, ఎ.ఉమామహేశ్వరి, కె.చిట్టిబాబు, బి.లక్ష్మణరావులను పూలమాల, శాలువాలతో సత్కరించారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు కె.హరిబాబు, బి.తాతబాబు, ఆర్‌వీఆర్ మూర్తి, ఎస్.రామచంద్రరావు, పోలుపర్తి రాంబాబు, పైల రమేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



రౌతులపూడిలో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

గిరిజనులకు ప్రత్యేక మండలం ఏర్పాటు చేయాలి

శంఖవరం: మండలంలోని పి.మల్లాపురం కేంద్రంగా తమకు ప్రత్యేక మండలాన్ని ఏర్పాటు చేయాలని గిరిజనులు కోరారు. ఈ మేరకు సోమవారం కాకినాడలో కలెక్టర్ షణ్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ ఏలేశ్వరం, రౌతులపూడి, శంఖవరం, ప్రత్తిపాడు మండలాల్లో 59 గిరిజన గ్రామాలు ఉన్నాయన్నారు. ఇవి సబ్‌ప్లాన్ పరిధిలో ఉండడంతో గిరిజనులకు ప్రత్యేక నిధులు రావడం లేదన్నారు. ఈ గిరిజన గ్రామాలను కలుపుతూ ప్రత్యేక మండలం ఏర్పాటు చేసి గిరిజనుల సమస్యలు తీర్చాలన్నారు. అలాగే గిరిజన గ్రామాలను రంపచోడవరం ఐటీడీఏలో చేర్చాలన్నారు. కార్యక్రమంలో గిరిజనులు గుండు చెంచుబాబు, జల్తా ముసలయ్య, బూసర బాలరాజు, తరుం నాగేశ్వరరావు, కింజ అప్పలకొండ, తంపాటి అర్జమ్మ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

విద్యారంగ సమస్యలపై రణభేరి

తొండంగి: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆర్థిక, విద్యారంగ సమస్యలపై రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చక్రవర్తి మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో తీవ్రమైన జాప్యం చేస్తోందన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిసినా ఏ ఒక్క సమస్యకు చెప్పుకోదగ్గ పరిష్కారం లభించలేదన్నారు. ఈ నెల 15 నుంచి 19 వరకు రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి ఉపాధ్యాయులను ఉద్యమానికి సిద్ధం చేసేందుకు రణభేరి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు సత్యనారాయణ, మండల అధ్యక్షురాలు వరలక్ష్మి, ప్రధాన కార్యదర్శి పి.సత్యనారాయణ, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో భారీ వర్షం

ఏలేశ్వరం: పట్టణంలో సోమవారం భారీవర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండతో పాటు ఉక్కపోతతో ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై భారీవర్షం పడింది. వర్షంతో ప్రజలు ఉపశమనం పొందారు. కాగా సుమారు గంట పాటు పడిన వర్షానికి రహదారులు, పల్లపు ప్రాంతాలు నీటమునిగాయి. రోడ్లపై వర్షపునీరు నిల్వ లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రత్తిపాడు రూరల్: మండల వ్యాప్తంగా సోమవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత కొనసాగింది. సాయంత్రం ఒక్కసారి ఆకాలంలో మేఘాలు కమ్ముకుని వాతావరణం చల్లబడింది. అనంతరం ఓ మోస్తారు వర్షం కురిసింది. ఎండ తీవ్రతకు అల్లాడిన జనం వర్షంతో ఉపశమనం పొందారు.

క్లుప్తంగా

దేవస్థానం భూముల కౌలు వేలంపై ఫిర్యాదు

గండేపల్లి: స్థానిక చంద్రశేఖరస్వామి దేవస్థానం భూముల కౌలు వేలంపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినట్టు రామయ్యపాలేనికి చెందిన సేనాపతి నారాయణ తెలిపారు. చంద్రశేఖర స్వామి ఆలయానికి గండేపల్లిలో సుమారు 4 ఎకరాలు, మురారిలో 2.26 ఎకరాల భూమి ఉంది. ఇందులోని కొన్ని సర్వే నంబర్లలో భూమికి దేవదాయశాఖ అధికారులు బహిరంగ వేలం నిర్వహిస్తామని జూలైలో కరపత్రాలు పంపిణీ చేయడంతో పాటు చాటింపు వేయించారు. 20 మంది రైతులు వేలంలో పాల్గొనేందుకు వెళ్లారు. వారిని సాయంత్రం వరకూ అక్కడే పడిగాపులు కాయించి వేలం నిర్వహించలేదన్నారు. దీనిపై కాకినాడ కలెక్టర్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు.

మురళీకృష్ణంరాజుకు సంఘీభావం



ధర్మవరంలో మురళీకృష్ణంరాజుకు సంఘీభావం తెలుపుతున్న ప్రసాద్‌రాజు

ప్రత్తిపాడు రూరల్: వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, ఆయన తండ్రి రామరాజులకు సోమవారం ఆ పార్టీ నేతలు సంఘీభావం తెలిపారు. వైఎస్సార్ సీపీ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ మాజీ విప్ ముదునూరి ప్రసాద్‌రాజు, రామచంద్రపురం నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు మండలంలోని ధర్మవరంలో మురళీకృష్ణంరాజును కలిసి సంఘీభావం తెలిపారు. రాజకీయ కుట్రలతో 86 ఏళ్ల వయసు కలిగిన ముదునూరి రామరాజుపై అక్రమ కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయంలో తనిఖీలు

కోటనందూరు: మండలంలోని కాకరాపల్లి గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ పి. వెంకటనారాయణ సోమవారం తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామంలో పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ సర్వేలు, సంక్షేమ పథకాల అమలులో సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.

గౌరవ వేతనం విడుదల చేయాలి

తుని: ఇమామ్, మౌజన్లలకు తక్షణమే గౌరవవేతనం విడుదల చేయాలని స్థానిక ముస్లిం సోదరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ జీవీఎస్ ప్రసాద్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. గత 11 నెలలుగా ఇమామ్, మౌజన్లకు గౌరవవేతనం అందకపోవడంతో అవస్థలు పడుతున్నామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు.

ఉల్లాస్ వలంటీర్లకు శిక్షణ

జగ్గంపేట: స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం ఉల్లాస్ వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అక్షర ఆంధ్ర కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓలు స్వామి, సుబ్రహ్మణ్యేశ్వరరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి సాంకేతికతను జోడించాలి

తుని రూరల్: నాణ్యమైన అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు వ్యవసాయంలో సాంకేతికతను వినియోగించాలని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. తుని మండలం వల్లూరు, టి.తిమ్మాపురం గ్రామాల రైతు సంఘాలకు సోమవారం రెండు డ్రోన్లను ఆమె అందజేశారు. టి.తిమ్మాపురం సమీపంలో ఆమె డ్రోన్లను ప్రారంభించారు. 20 శాతం రైతు వాటా, 80 శాతం ప్రభుత్వ రాయితీపై అందించిన వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఒక్కొక్క డ్రోన్ ఖరీదు రూ.10 లక్షలు అని ఏఓ బి.అశోక్ కుమార్ తెలిపారు. తొలుత ఎమ్మెల్యే దివ్య దొండవాక గ్రామంలో ప్రజా దర్బారు నిర్వహించారు. ప్రజా సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, కాపారపు అబ్బు, అత్తి అచ్చుతరావు, యనమల రాజేష్, చింతంనీడి నాగసోమరాజు, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రత్తిపాడు: మండలంలోని పెదశంకర్లపూడి - లంపకలోవ గ్రామాల మధ్య సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. లంపకలోవ గ్రామానికి చెందిన బి.చక్రరావు సైకిల్‌పై పెదశంకర్లపూడి నుంచి తన స్వగ్రామం వెళ్తుండగా మార్గం మధ్యలో ఆగి ఉన్న క్వారీ లారీని ఢీకొన్నాడు. చీకటి ప్రదేశం కావడంతో ముందు ఉన్న లారీని ఢీకొని పడిపోయాడు. గాయపడిన చక్రరావును ప్రైవేటు అంబులెన్సులో ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు.